# చేతులు కాలాయి

**శాం**త కూరలు తరుగుతోంది. తండ్రి వస్తాడన్న వార్త విన్న శాంత ముఖంలో సంతోషం లేదు. నిర్లిప్తత మలుచుకునిపోయి ఉంది ఆ ముఖంలో.

'సంగతీ సందర్భం రాయకుండా వస్తున్నానని మాత్రం రాశాడు' విసుక్కుంటున్నట్లు అన్నాడు మూర్తి, శాంత భర్త.

'ఎందుకు రావటం! ఏమైనా ఆస్థి మూట గట్టుకు వస్తున్నాడా! అంత అదృష్టం ఉంటే బాగానే ఉండేది. రావటం చూడటం పోవటం అంతే మిగిలింది'. అత్తగారు అంటుంటే తలవొంచుకుంది శాంత. అవి రోజూ శాంత వినే మాటలే. ఐనా పాడు మనసు దేనితో చేశాడో భగవంతుడు పూర్తిగా విరిగిపోదు. రాయీ ఐపోదు. వయసు ముదిరిన ఆవిడ నోటికి హద్దు వుండదు.

'బిడ్డలంటే ప్రేమ లేకపోతే కనటమెందుకు? కామాంధకారం కాకపోతే, ఒక్కగానొక్క ఆడపిల్ల! శని వదిలినట్లు కట్నం డబ్బులిచ్చి అత్తవారింట్లో దిగబెట్టాడు. పోనీ ఏమీ లేదా అంటే వేలకి వేలు సంపాదిస్తున్నాడు. ఆస్థి ఉంది. మనకి అదృష్టం వుండద్దూ. నీ మొహానికి చూస్తే పెట్టబుద్ధి కాదు'. అట్లాగ సాగుతుంది ఆవిడ వాక్ప్రవాహం. ఆవిడ మాటలు వింటూ పమిటకొంగు నోట్లో కుక్కుకొనేది శాంత. మొదటి నుంచీ ఒకేరకంగా ఉంటే ఈ బాధ ఉండేది కాదు. పూల వుయ్యాలలో కూర్చోపెట్టి ఊపుతూ క్రిందికి తోసినట్లయింది తన పని.

ఆరు సంవత్సరాల క్రిందట, ఆరువేలు కట్నమిచ్చి పెళ్ళి చేశాడు శాంతకి తండ్రి. అతడికి శాంత ఒకతే కూతురు. భార్యపోయాక మళ్ళీ పెళ్లి చేసుకోలేదతడు. అతడికి బోలెడు ఆస్థి ఉండడమేకాక ఉద్యోగంలో బాగా సంపాదిస్తున్నాడు. మూర్తి చదువుకుని ఉద్యోగం చేస్తున్నాడు. కొంచెం ఆస్థికూడా వుంది. ఒక్కడే కొడుకు. బంధువులుకూడాను. అది మంచి సంబంధమే. అందమూ, చురుకుతనమూ, వినయమూ సమపాళ్లలో వున్న శాంతని చాలా ప్రేమగా

చూసుకునేవాడు మూర్తి. అత్తగారు పని చెయ్యనిచ్చేది కాదు. ఇరుగుపొరుగుతో 'మా యింటి లక్ష్మి' అని చెప్పుకునేది. శాంతకి నెల తప్పింది పెళ్లి అయిన మూడు నెలలకి. పట్టుచీర, బంగారు గాజులు పెట్టి ఘనంగా సూడిదలు జరిపించిందావిడ. 'శాంతకి కొడుకు పుడితే దత్తత చేసుకుంటాను' అన్నాడు తండ్రి అప్పుడు. శాంతకి పెళ్లిలో పెట్టిన నగలుకాక తల్లినగలు, ఏభైవేలుచేసే ఇల్లు, పాతిక ఎకరాల పొలం, అతడి సంపాదన నిలవలు కలిసి మొత్తం మూడులక్షల ఆస్థి ఉంది తండ్రికి. ఆస్థి చూసుకునే మూర్తి, అతడి తల్లి కట్నానికి బేరమాడలేదు. శాంతకి రావలసిన ఆస్థి మనవడికిచ్చినా ఒకటే అనుకుంది అత్తగారు. మూర్తికి కూడా రాబోయే ఆస్థినిగురించి ఆశలూ, అభిప్రాయాలూ ఏర్పడ్డాయి.

ఇప్పుడు తమది చిన్న డాబా యిల్లు. ఏభైవేలుపైగా ఖర్చుపెట్టి ఆధునికమైన సదుపాయాలతో అన్ని హంగులతో ఒక పెద్ద ఇల్లు కట్టించాలి. ఒక కారు కూడా కొనాలి. ఏదైనా బిజినెస్ చెయ్యాలి. లేదా డబ్బును వడ్డీలకి తిప్పాలి. డబ్బును వాడుకోవటం తెలియాలి కానీ అది పిల్లల్ని పెడుతుంది. రెట్లు రెట్లుగా పెరిగిపోతుంది. తనూ, శాంతా పిల్లలూ దర్జాగా ఉండాలి. అన్ని సుఖాలూ అనుభవించాలి. డబ్బు అనుభవించ టానికి కాక ఎందుకు? అతడు భార్య ఆస్థికోసం ఎదురుచూస్తున్నాడు.

శాంతకి నెలలు నిండి ఆడపిల్ల పుట్టింది. అత్తగారు ఆ అసంతృప్తిలో నుంచి తేరుకోకముందే, ఆరునెలలు గడవకుండానే శాంత తండ్రి ఎవరూ అనుకోని పని ఒకటిచేసి ఆవిడనీ, మూర్తినీ నిర్ఘాంత పరిచాడు. ఆయన మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. అప్పటినుంచి అత్తగారు మారిపోయింది.

'ఇప్పుడు మీ నాన్నకి పెళ్లి కావలసి వచ్చింది. వో కొడుకును కనలేక పోయావు. ఇప్పుడాయనే కంటాడు వో కొడుకుని. ఇంక నీకు ఆస్థేం దక్కుతుంది! నీ మొహానికింక ఏడుపే. మాకు ఆ కట్నం డబ్బులే ప్రాప్తం. తొందరేమిటనుకున్నాం. ఆయనే తొందరపడ్డాడు. ఇంక నీకు మగపిల్లలే పుట్టరా?' అంది అత్తగారు. ఆవిడ అన్నట్లుగానే తండ్రి పెళ్లి చేసుకున్న ఏడాదికే కొడుకు పుట్టాడు. కాన్పు కష్టమయి ఆపరేషనుతో గండం గడిచింది భార్యకి. రెండవసారి శాంతకి కొడుకు పుట్టాడు.

'వీడు అప్పుడే పుట్టిఉంటే అత్తగారి పోరు, ఆయన అసంతృప్తి తప్పివుండేవి నాకు. దేవుడెందుకో ఇట్లాగ అన్యాయం చేశాడు నాకు' అనుకుంది. ఐనా తండ్రి చేసిన దానిలో తప్పు కనిపించలేదు శాంతకి.

'అమ్మ పోగానే - పెళ్లి చేసుకోలేదు నాన్న. ఇన్నాళ్లూ ఏమీ సుఖపడలేదు. ఆడపిల్లని నేను ఇంకొకచోటికి పోయేదాన్ని. వంశం నిలిపేవాడూ, ఉద్ధరించేవాడూ కొడుకు. ఎవరికైనా తమ సంసారం అంటూ ఉండాలని, సుఖపడాలనీ ఉంటుంది. ఇప్పటికైనా నాన్న సుఖపడటం సంతోషించవలసిన సంగతి' అనుకుని మనసులో తృప్తి పడింది.

ఆ తృప్తిలో కొంతవరకూ తన బాధ మరిచిపోయింది. తరవాత భర్త అత్తగారూ ఆలోచించుకుని తల్లి నగలు, ఆస్థి అడగమని పుట్టింటికి పంపించారు. ఆ పదిరోజులూ పిన్ని తనని బాగానే చూసింది. కానీ నగలు అడిగితే తండ్రికి బదులు పిన్ని జవాబిచ్చింది.

'ఈ ఇంటినగలు బయటికి పోవటం ఎందుకు! వాటి బదులు మీ నాన్న నీకు పొలం రాసిస్తారు. ఐనా ఇప్పుడు తొందరేమిటి దానికి మాత్రం!' అంది.

పిన్ని ఇచ్చిన కొత్తచీర పుచ్చుకుని ఇంటికి తిరిగి వచ్చింది శాంత. అత్తగారు సాధించటమేగాక ఇంటి పనంతా అప్పగించింది. అంతగా ప్రేమించిన భర్త 'తెలివితక్కువదానివి, దరిద్రపు మొహం' అనడానికి వెనుకాడలేదు. మూడు లక్షలు రావలసినచోట నగలుచేసే పాతికవేలు మాత్రమే దక్కుతాయి. అదీ ఎప్పుడో! అతడిలోని అసంతృప్తిని శాంతపట్ల అతడికి గల ఆకర్షణా అనురాగం జయించలేకపోయాయి. అతడిలో శాంతమీద ఉన్న ప్రేమ తరిగిపోతోంది. అసంతృప్తి పెరిగిపోతోంది. అది అతడి సుఖంలో గోతిని తవ్వుతోంది. ఆ గొయ్యి అగాధంగా ఎదిగిపోతోంది.

'ఇంకొకరి ఆస్థి అనుభవించాలని వీళ్లకంత ఆశ! తనది తాను అనుభవించాలని నాన్నకి ఉండదా? వీళ్లు మాత్రం అంతలేనివాళ్లు కాదు. ఉన్నదానితో ఎందుకు సంతృప్తి పడరు!' అని బాధపడేది శాంత.

ఆమెలోని ఆశలూ, కోరికలూ అన్నీ మనసులోనే అణిగి పోయాయి. నిర్లిప్తంగా ఉండటానికి ప్రయత్నించేది. యాంత్రికంగా పనులు చేసేది. మూర్తి భార్య అవసరాలు కనుక్కునేవాడు కాదు. పైగా బుద్ధిపుట్టి ఒక చీర తెచ్చినప్పుడు కూడా –

'ఎప్పుడూ మాసిన చీర చిరిగిన గుడ్డలూ కట్టుకుంటావు. శుభ్రంగా అందంగా ఉండటం చేతకాదు. దానికి తోడు ఏడుపు మొహం ఒకటి' అనేవాడు.

'ఎంత చేసినా నీకు తృప్తిలేదు' అనేవాడు.

దగ్గరకు తీసుకున్నప్పుడు కూడా 'మొద్దు మొహం, ఒక మాటా, నవ్వూ

లేదు. సుఖపడే యోగం లేదు' అనేవాడు. శాంత అతని చేతుల్లో బిగుసుకుపోయేది. చీకట్లో ఒంటరిగా కూర్చుని ఏడవటం తప్ప ఏమనాలో, ఏం చెయ్యాలో తెలిసేదికాదు. అప్పుడప్పుడు తండ్రిమీద కోపంకూడా వచ్చేది.

'ఔను. వీళ్లనేది న్యాయమే. కూతురికేమీ ఇవ్వకపోవటం అన్యాయమే. కూతురినన్న సంగతే మరిచిపోయారు నాన్న. వీళ్లు నన్ను బాధపెడుతున్నారని నేనిక్కడ కష్టపడుతున్నానని నాన్నకి తెలుసు. ఐనా ఊరుకున్నారు' అనుకుని ఏడిచేది.

తండ్రి అప్పుడప్పుడు వచ్చి చూసి వెడుతుండేవాడు. కూతురిలో వస్తున్న మార్పును అతడు గ్రహించాడు. క్రమంగా శాంత చిక్కిపోతోంది. కళ్ల గుంటలు పట్టాయి. దవడలు పీక్కుపోయాయి. మొహంలో కళకాంతులు లేవు.

'ఒంట్లో బాగుంటోందా? అట్లాగున్నావూ!' అనడిగాడు ఒకసారి.

అది విన్న అత్తగారు

'ఒంట్లో బాగుండకపోతే మాత్రం తిని కూర్చుంటే జరుగుతుందా! మాకంతంత ఆస్తులు లేవు. కట్నం పారేసి మీ బాధ్యత తీర్చుకున్నారు. బోలెడు ఆస్థి వస్తుందని కదా ఇచ్చిన కట్నం పుచ్చుకుని ఊరుకున్నాం. రామయ్యగారి పిల్లకి పదివేలు కట్నమిస్తానని వచ్చారు. ఇంత హీనంగా పిల్లని వదిలేస్తారని తెలిస్తే అసలు చేసుకోకనే పోదుము'' అంది.

ఆసారి అతడు ఇంటికి వెళ్లగానే

'శాంతకి ఏమైనా ఇవ్వాలి. పొలం రాసిస్తాను' అన్నాడు.

జానకి మృదువుగా నవ్వింది.

'మీకు ఇవ్వాలనిపిస్తే గుడ్డలివ్వండి; కొంత డబ్బు చేతిలో పెట్టండి. అంతేకానీ ఆస్థి రాసుకుంటారుటండీ! మనకి మగపిల్ల వాడుండగా అవేం మాటలు!'' అంది.

ఇంకొకసారి ప్రసక్తి వచ్చినప్పుడు

'మీకు నేను సుఖంగా ఉండాలని లేదా! నన్నెందుకిట్లాగ బాధపెడతారు! మీరు మళ్లీ పెళ్లిచేసుకోవలసింది కాదు...' అంది.

ఆ వాదన అతడికి అర్థం కాలేదు. తను పెళ్లి చేసుకోవటంలో తప్పేమిటో అతడికి అర్థం కాలేదు. ఒక నిట్టూర్పు విడిచాడు. మనసులో ఆవేదన మగ్గుతుంటే కూతుర్ని చూడటానికి వెళ్లటం మానేశాడు.

తనలాగే తండ్రికూడా నిస్సహాయుడు!

'ఇప్పుడెందుకు వస్తున్నారు నాన్న! పిన్నిని ఒప్పించారేమో! కాస్త ఇస్తే వీళ్ల ఆశ తీరుతుందా? సగం ఆస్థి కావాలి!' నిట్టూర్చింది.

వంట మొదలుపెట్టింది. కూర చేస్తుంటే అత్తగారు దగ్గరకు వచ్చి.

'రెండవ కూర ఎందుకు?' అంది.

'మా నాన్న వేపుడు తినరు' అంది శాంత.

'ఆ నాన్నకి ఏం మర్యాద.... మన్నన.....' అని సణిగిందావిడ.

మావగారు వస్తారని మూర్తి ఇంట్లోనే ఉన్నాడు. తండ్రి రిక్షా దిగి లోపలికి వస్తుంటే గుమ్మంలోపలే నిలబడిపోయింది శాంత. ఆతృతని అరికట్టుకోలేకపోతున్నాయి చూపులు. కల్లోలంగా ఉంది మనసు. ఎందుకు వచ్చారో అనే ప్రశ్న వేధిస్తోంది. ఎదురువెళ్లి పలకరించాలనిపించ లేదు. గడప లోపలే ఉండి చూస్తోంది. అతడి గడ్డం పెరిగి ఉంది. పంచె లాల్చీ మాసి సంస్కారహీనంగా ఉంది రూపు. ముఖం బాగా పీక్కుపోయి ఉంది జబ్బుపడ్డవాడిలాగ.

'నాన్న ఇట్లాగయిపోయారేమిటి! నాన్నకేదో అయింది!' కీడుని శంకించిందామె మనసు. గుండె వేగంగా కొట్టుకుంది. కంట్లో నీళ్లు తిరిగాయి. చాలా సామాను ఉండటం చూసి తల్లీకొడుకులు ముఖాలు చూసుకున్నారు.

'అంతా క్షేమమా?' కళావిహీనంగా నవ్వుతూ అడిగారాయన.

ఆయనకి కుర్చీవేసి తనూ ఒక కుర్చీలో కూర్చుంటూ.

'ఆ! మీ దయవలన అంతా బాగున్నాం. మీరు రావటమే ఆశ్చర్యంగా ఉంది!' అన్నాడు మూర్తి.

ఆయన ఒక నిముషం మౌనంగా ఉండి తర్వాత అన్నాడు.

''ఔను. నేను హిమాలయాలలో... శివానందాశ్రమానికి వెడదామని బయలుదేరాను. జీవితాంతం అక్కడ ఉండటానికి ఏర్పాటు చేసుకున్నాను. వెళ్లే ముందర శాంతని ఒకసారి చూసిపోదామని!'' మూర్తికి, అతడి తల్లికి ఒక క్షణం నోటమాటరాలేదు.

'అంత ఆస్థి, సంపాదన, ఇల్లు, ఇల్లాలూ, వంశోద్ధారకుడూ అందరూ ఉన్నారు. అన్నిటినీ వదిలిపోతున్నానంటున్నాడు. ఈయనకి పిచ్చి ఎక్కలేదు గదా! ఆ పెళ్లాం ఆస్తి రాయించుకుని వెళ్లగొట్టిందేమో! లేచిపోయిందో! రెండవ భార్య అంతకంటె ఎక్కువగా చేస్తుందేమిటి! అదే అయితే మంచి శాస్తి అయింది!' అనుకుని తన ఆలోచనలోంచి తేరుకుని ఆవిడ అంది.

'అదేమిటి అన్నయ్యగారూ! నిక్షేపంలాంటి సంసారం వదులుకుని ఎక్కడికో పోతున్నానంటున్నారు!'

మళ్ళీ ఆయన ఒక నిముషం మౌనంగా ఉండిపోయాడు. తరవాత -

'సంసారం! హరి జబ్బుచేసి పోయాడు. డబ్బూ, డాక్టర్లు వాడిని బ్రతికించలేకపోయారు. ఆ బెంగతోనే అసలే అనారోగ్యంగా ఉన్న జానకి కూడా నెల తిరక్కుండా పోయింది. ఇంకేమి మిగిలింది! ఇంక నేనేం చెయ్యాలి! ఈ జన్మకి ఈ జీవితం చాలు. ఇంక ఏ సంబంధాలూ వద్దు. శాంతని ఒకసారి చూసి వెళ్ళిపోతాను' అన్నాడు.

అంతలో అతడి పెదవులమీదకి ఒక వింత నవ్వు వచ్చింది.

'ఇల్లూ, పొలమూ, నగలూ, నలభైవేల క్యాషూ అన్నీ దానిపేరనే, శాంత పేరునే రాశాను. అవన్నీ దానికి ఇచ్చి వెళ్ళిపోతాను' అన్నాడు మూర్తిని, ఆవిడని చూస్తూ

'ఇప్పుడు మీకు తృప్తిగా ఉందా' అని ప్రశ్నిస్తున్నట్లుందా చూపు. లోపలి నుంచి వస్తున్న సంతోషాన్ని అణుచుకోలేకపోతోందావిడ. 'మీకెంత కష్టం వచ్చింది! డబ్బుదేం ఉంది! ఇవేళ కాకపోతే రేపిస్తారు! కన్నకూతురికి ఇచ్చుకోమని ఒకరు - చెప్పాలా?' అని లోపలికి అడుగేసి 'మీ నాన్న వస్తే పలకరించవేమే! వెళ్ళి మంచినీళ్ళిచ్చిరా, భోజనానికి ఆలస్యమవుతోంది' అంది.

ఆవిడ పాలు పొయ్యిమీద పెట్టి సేమ్యా చేస్తుంటే చూసి నీళ్ళు తీసుకువెళ్ళి తండ్రి కిచ్చింది. ఇస్తుంటే చెయ్యి గజగజా వణికింది. కళ్ళలోనుంచి నీళ్లు రాలాయి. మనసు బాధతో నిండిపోగా 'నాన్నా' అనే మాట కూడా గొంతు పెగిలి బయటికి రాలేదు. తన మీద వాలిపోతున్న కూతురి తల నిమిరాడు ఆయన.

'నీకేం భయంలేదు తల్లీ. ఇంక నీ కాపరం చక్కబడుతుంది. నీకు సుఖపడే రోజులొచ్చాయి. నీ భర్త, అత్తగారు ఇంక నిన్నేం అనలేరు' అని అభయ మిస్తున్నట్లుగా ఉందా స్పర్శ. చప్పున లోపలికి వెళ్ళిపోయింది శాంత. అక్కడే ఉన్నాడు మూర్తి. 'ఛ, తొందరపడ్డాను. అనవసరంగా శాంతని బాధపెట్టాను. ఆయన ఎప్పటికైనా ఇచ్చి ఉండేవాడు ఆస్థి. ఈ డబ్బు గొడవ మనసులో పెట్టుకుని శాంతని కష్టపెట్టాను. నేనూ సుఖపడలేదు మనస్ఫూర్తిగా. ఇప్పుడైనా శాంతని సంతోషపెట్టాలి' అనుకున్నాడు.

అతడిలో పశ్చాత్తాపం కలగటం మొదలుపెట్టింది.

వంటింట్లోకి వెళ్లింది శాంత. పాయసం తయారయింది. అప్పుడే అన్నీ వడ్డించేసింది అత్తగారు.

'భోజనానికి రమ్మను. ఇప్పటికే ఆలస్యమయింది' అందావిడ. శాంత అక్కడే నిలబడిపోయి అత్తగారిని చూస్తోంది. ఇన్నేళ్లనించి బాగా తెలిసినవ్యక్తి ఐనా ఆవిడని చూస్తుంటే విభ్రాంతిగా ఉంది.

'నాన్న ఎంత బాధలో ఉన్నారు! భార్యా కొడుకూ పోయారు. వీళ్ల పాషాణసములనే నాన్న ఉత్తరం కూడా రాయలేదు. ఎంత వ్యధచెందితే, విరక్తి కలిగితే నాన్న వెళ్లిపోతున్నారు! పిండివంటల తోటి మర్యాద చేస్తోంది ఇప్పుడు! ఎంతలో ఎంత మార్పు మనిషిలో! నాటకం!'

శాంతలో కోపం, కసి, అసహ్యం రగులుకుంటున్నాయి. అక్కడనించి కదలలేదు. మూర్తి వెళ్లి మావగారిని పిలుచుకువచ్చాడు. అందరూ కూర్చుని భోజనం చేస్తున్నారు. ఆవిడ తన విచారం వెళ్లపోసింది.

'మీరు శాంతని, మనవళ్లనీ చూసుకుంటూ ఇక్కడే ఉండిపొండి. ఆ సన్యాసులతో కలిసి కష్టాలు పడటమెందుకు? మీకేం తక్కువ జరగదు. మహారాజులాగ గడిచిపోతుంది' అంది. మూర్తికూడా అదేమాట అన్నాడు. తండ్రి నవ్వి ఊరుకున్నాడు. శాంత అత్తగారు భోజనానికి కూర్చున్నారు.

'ఇంకొంచెం పాయసం వేసుకో. ఈమధ్య మరీ చిక్కిపోతున్నావు. తిండి సమంగా తినవుకదా. నేను పెద్దదాన్నయిపోయాను. ఇల్లూ, పిల్లల్నీ చూసుకోవలసిన దానివి ఇట్లాగ ఈసురోమంటూ ఉంటే ఎట్లాగ గడుస్తుంది సంసారం!' అంది అత్తగారు.

'నా తిండి సంగతి కనుక్కుంటోంది. సంసారంలో కిటుకులు బోధిస్తోంది. ఎక్కడ నుంచి వచ్చిందీ ప్రేమ; పిల్లలు పెరుగు అడిగితే మీ తాత తోలిన ఆవులు లేవనేది! నాన్న ఎంత బాధ భరిస్తున్నారో అనే ఆలోచనే లేదు మనుషులకి! ఆస్థి వచ్చిందని మురిసిపోతున్నారు! నాటకం ఆడుతున్నారు! శాంత తనలో బాధపడుతూనే ఉంది భోజనం చేసినంతసేపూ'.

భోజనం చేశాక ఒకగంట పడుకుని లేచాడు తండ్రి. పెట్టె తెరిచి ఒక నగల పెట్టె దస్తావేజులు బయటికి తీసాడు. మూర్తిని పిలిచి 'రైలు వేళవుతోంది. ఒక రిక్షాని పిలిపించు' అన్నాడు.

రోడ్డుమీద పోయే రిక్షాని ఆపి లోపలికి వచ్చాడు మూర్తి.

'నేను వెళ్లాలి. శాంతని రమ్మను. ఇవి అప్పగిస్తే నా బాధ్యత, ఇహలోక సంబంధాలన్నీ తీరిపోతాయి. శాంత జాగ్రత్త. అంతకంటె నేనేమీ చెప్పలేను బాబూ' అన్నారాయన.

మూర్తి శాంతని పిలుచుకు వచ్చాడు. తండ్రి శాంత చేతుల్లో నగలపెట్టె, దస్తావేజులు ఉంచాడు.

'నేనివ్వగలిగింది ఇంతే తల్లీ. ఇంక నాకు అన్నింటితో, అందరితో ఋణం తీరింది. మీరంతా సుఖంగా ఉండండి' అన్నాడు.

గిరుక్కున తిరిగి వెళ్లి రిక్షాలో కూర్చున్నాడు.

శాంత మాట్లాడలేదు. ప్రతిమలా హాలుమధ్య నిలబడిపోయింది. రిక్షా కనుమరుగయ్యేదాకా చూసి, మూర్తి, ముసలావిడ, పిల్లలూ లోపలికి వచ్చారు. స్టేషన్‌కి వస్తానంటే మూర్తిని వద్దని వారించారాయన. నేను సన్యాసిని అన్నారు.

మూర్తి లోపలికి వచ్చేటప్పటికి శాంత ఇందాకా నిలబడిన చోటే కూర్చుని ఉంది. ఒడిలో నగలపెట్టి, దస్తావేజులు ఉన్నాయి. అతడు శాంత మొహంలోకి చూశాడు. శాంత తన మొహంలోకి బెదురు లేకుండా చూడటం కొత్తగా ఉంది అతడికి. చిన్నగా నవ్వి 'ఆకస్మిక ధనలాభం' అన్నాడు.

శాంత కూడా నవ్వింది. అట్లాగ బాధ లేకుండా. భయం లేకుండా ఎప్పుడూ నవ్వలేదు శాంత. తండ్రి తన చేతికి నగలూ, ఆస్థి అన్నీ ఇచ్చిపోయాడు. ఆమె మనసు సుడిగండంలో పడ్డ మనిషిలా గిరగిరా తిరిగిపోతోంది. సాలెగూడులో చిక్కిన ఈగలా గిలగిలా కొట్టుకుంటోంది.

'ఈ లోకం మీదా, బ్రతుకు మీదా విరక్తితో నాన్న వెళ్లిపోయారు. ఆస్థి వచ్చిందని మీరు సంతోషిస్తున్నారు. ఎట్లాగ వచ్చిందా ఆస్థి! భార్య కొడుకూ పోయి నాన్న బాధతో విరక్తితో మగ్గుతుంటే వచ్చిందా ఆస్థి! ఇన్నాళ్లూ నన్ను ఏడిపించారు. ఇప్పుడు మిమ్మల్ని ఆడిస్తాను!'

ఆలోచనలతో పళ్లు బిగసుకుంటున్నాయి. అసహ్యం నిండి పోతోంది మనసులో.

'ఛీ డబ్బు పాపిష్టిది. నాన్న సుఖాన్ని మింగేసి వచ్చిన డబ్బు నాకు వద్దు. వాళ్ల మొహాన్నే పారేస్తాను. ఇన్నాళ్లూ ఆస్థి ఆస్థి అని గిలగిలలాడారు. వాళ్ల ఇష్టం వచ్చినట్లు చేసుకోనీ. ఉట్టి గట్టుకుని ఊరేగనీ!'

అంతలో కసి, అసహ్యం, మరుక్షణంలో బాధా విరక్తి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

'ఆకస్మిక ధనలాభంటు! కాదు మీ తపఃఫలం. నా పాపపరిహారం'. నవ్వు వచ్చింది శాంతకి. అంతలోనే పళ్లు గిట్టకరిచి –

'ఇన్నాళ్లూ దీనికోసమే కదూ నన్ను బాధ పెట్టారు! నా కసి తీర్చుకోటానికి ఇదే అవకాశం. అవకాశం వచ్చినప్పుడే వాడుకోవాలి. విడవకూడదు! ఇప్పుడు చూసుకోండి.... మీరు నా చేతిలో కీలుబొమ్మలు!'

'ఛీ పగ దుర్మార్గుల లక్షణం.... ఇన్నాళ్లూ నేను అనుభవించిన బాధ చాలు - వాళ్లు ఎట్లాగైనా మారనీ. నేను ఇట్లాగే వుంటాను. ఆ డబ్బూ వద్దు. పగా వద్దు. సుఖాలూ వద్దు. డబ్బు లేకపోతే ఏడిచి, గంతులు వేసే నాటకం వాళ్లనే ఆడనీ....'

'ఊహుఁ ఇది నాది.... ఇవ్వ... చంపేస్తారేమో! మరీ మంచిది....'

గట్టిగా నవ్వు వచ్చింది శాంతకి... రసాత్మకమైన నాటకం చూస్తున్నట్లు మనసులో వినోదంగా వుంది.

అత్తగారు శాంతకి దగ్గరగా వచ్చి 'వంద తులాల బంగారం అన్నారు. ఏమేం నగలున్నాయి!' అంది కుతూహలంగా.

పెదిమలు విడివడకుండా సన్నగా నవ్వుతూ పెట్టె తెరిచింది శాంత.

బంగారం, రాళ్లు, ముత్యాలతో చేసిన నగలు రకరకాలుగా మెరుస్తున్నాయి.

కాసులపేరు, పలకసర్లు, ముత్యాల నెక్లెస్, గాజులు, మిరియాల గాజులు, రవ్వల వంకీలు.... వంద తులాలు... అంటే ఇరవై వేలు....' అంది.

ఆవిడని చూడమని అందిస్తున్నట్లు పట్టుకుంది. ఆవిడ చెయ్యి ముందుకు చాపి పెట్టె అందుకోబోయింది. శాంత చప్పున పెట్టెను దగ్గరగా తీసుకుని మూత పెట్టేసింది. ఆవిడవైపు చూసి నవ్వింది నిరసనగా.

'ఇవి నావి' అంది.

అత్తగారు శాంతవైపు విడ్డూరంగా చూసి.

'నీవే. నీవికాకపోతే నావా? పెట్టుకో. లక్ష్మీలాగుంటావు' అంది.

'అమ్మవారి లాగుంటాను' ముద్దుగా గునుస్తూ అంది శాంత.

'ఆ దస్తావేజులిటియ్యి. బీరువాలో పెడతాను' అన్నాడు మూర్తి ముందుకు వచ్చి. పెట్టి, దస్తావేజులు కలిపి గట్టిగా పట్టుకుంది శాంత.

'మూడులక్షల ఆస్థి. ఊహు ఇది ఇవ్వను. నాది, నాయిష్టం'

ఓరగా అతడిని చూసి నవ్వుతూ అంది.

'నీదేలే. ఇటియ్యి' మూర్తికూడా నవ్వి అన్నాడు.

శాంత చెయ్యి చాపింది. అతడు అందుకోబోయాడు. చప్పున చేతిని వెనక్కు లాక్కుంది శాంత. వస్తువులు ఒడిలో దాచి.



4

'పాపం... ఆశ!' అంటూ తమాషా చేస్తున్నట్లు పెద్దగా నవ్వింది.

మూర్తి కోపంగా చూసి

'ఏమిటా పిచ్చివేషాలు!' అన్నాడు.

చప్పున ఆ నగల పెట్టెను దూరంగా తోసిపారేసింది. దస్తావేజుల్ని విసిరికొట్టింది.

'మీవి పిచ్చివేషాలు. మీకు పిచ్చి. దీని కోసమేకదూ పిచ్చెక్కిపోయారు. నాకు నగలువద్దు. ఆస్తి వద్దు. నేను మీ భార్యని కాదు. ఆవిడ కోడల్ని కాదు. పనిచేసేదాన్ని. మీరే తీసుకోండి' ఇవ్వకపోతే మీరు నన్ను చంపేస్తారు!' మొహానికి చేతులడ్డం పెట్టుకుని గట్టిగా ఏడుస్తోంది శాంత.

మూర్తి తెల్లబోయి తల్లివైపు చూశాడు. ఆవిడ నగలపెట్టి తీసి కళ్లకద్దుకుని మూర్తికి అందించింది. రెండు వస్తువుల్ని భద్రపరిచి భార్య దగ్గరికి వచ్చాడు మూర్తి. అతడి కెందుకో భయంగా వుంది.

'ఛ! ఏమిటిది పిచ్చిదానిలాగ! ఐనదేదో అయిపోయింది. సంతోషంగా ఉండాలి. మీ నాన్నకోసం బాధపడుతున్నావా?'' అన్నాడు. శాంత ఏడుపు ఆపి గలగలా నవ్వింది. కళ్లు పెద్దవిచేసి అతడిని చూస్తూ....

''నాన్నకోసం బాధ ఎందుకు! ఆయన సుఖంగా ఉంటారు ఇంక. బాధలు దాటిపోయారు. నా బాధంతా మీ కోసమే.... ఎట్లా బ్రతకాలో తెలియదని! కాదు. బాధ ఎందుకు! సంతోషంగా ఉండాలి. ఆస్థి వచ్చింది కదూ. ఔను. నేనూ సంతోషంగా ఉంటాను. హి... హి... హి... ఉంటాను... హి.... హి....' శాంత నవ్వటం మొదలుపెట్టింది. కళ్లలోంచి నీళ్లు వస్తున్నాయి. నవ్వు ఏడుపుగానూ, ఏడుపు నవ్వుగానూ మారుతోంది. ఏకవికా పకపకా నవ్వుతోంది... వెక్కి వెక్కి ఏడుస్తోంది.

మూర్తి మతిపోయిన వాడిలాగ శాంతని చూస్తూ నిలబడి పోయాడు. అతడికి మనసులో పెద్ద అగాధం కనిపిస్తోంది. శాంత వెనకాల తనూ పిల్లలూ అందులో పడిపోతున్నట్లుగా ఉంది. భయంతో బాధతో గడ్డకట్టుకుపోతోంది అతడి గుండె.

ఆంధ్ర సచిత్రవారపత్రిక, 30-10-1970

* * * *